సాక్షి
మంచిర్యాల

శుక్రవారం । 15 । సెప్టెంబర్ । 2023



తుది మెరుగులు

తీరొక్క రూపాల్లో వినాయక విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 18న వినాయక చవితి సందర్భంగా విక్రయదారులు గణనాథుల ప్రతిమలకు తుది మెరుగులు దిద్దుతున్నారు. IIలో▸



ఘనంగా పొలాల అమావాస్య

జిల్లాలోని పలు గ్రామాల్లో గురువారం పొలాల అమావాస్య పండుగ ఘనంగా నిర్వహించారు. రైతులు వ్యవసాయ పనిముట్లు, ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి నైవేద్యాలు సమర్పించారు. IIIలో▸



వాతావరణం

ఉదయం ఉరుములు, మెరుపులతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది. సాయంత్రం వేళ ఆకాశం మేఘావృతమై ఉంటుంది. నైరుతి దిశగా గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్

శిక్షణలో గొల్లపల్లి సర్పంచ్



శిక్షణ పత్రం అందుకుంటున్న సర్పంచ్

నెన్నెల: రాష్ట్ర గ్రామీణాభివృద్ధి సంస్థ మహిళా సర్పంచ్‌లకు 'పంచాయతీరాజ్ సంస్థలో మహిళలు' అనే అంశంపై హైదరాబాద్‌లో మూడు రోజుల శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. జిల్లా నుంచి ఆరుగురు సర్పంచ్‌లు హాజరు కాగా మండలంలోని గొల్లంపల్లి సర్పంచ్ ఇందూరి శశికళ పాల్గొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలనే ఉద్దేశంతో ఈ శిక్షణ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ తెలిపారు. ఈ కార్యక్రమంలో సీడబ్ల్యూసీడీ రాష్ట్ర సభ్యురాలు నాగమణి, రాష్ట్ర శిక్షకులు భగవాన్‌దాస్, మోహన్‌గాంధీ పాల్గొన్నారు.

ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత



మాట్లాడుతున్న దుర్గప్రసాద్ స్వామి

జన్నారం: ఆధ్యాత్మిక చింతనతోనే మానసిక ప్రశాంతత లభిస్తుందని, ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని హనుమాన్ దీక్ష పీఠాధిపతి దుర్గప్రసాద్‌స్వామి అన్నారు. గురువారం తిరుమల తిరుపతి దేవస్థానం రథానికి మండలంలోని ఇందన్‌పల్లి గ్రామంలో జన్నారం హనుమాన్ చాలీసా పారాయణ భక్తులు, హనుమాన్ భక్తులు ఘనంగా స్వాగతం పలికారు. మండల కేంద్రంలోని రామాలయంలో పూజలు చేశారు. ఈ సందర్భంగా దుర్గాప్రసాద్‌స్వామి మాట్లాడుతూ జనవరి 21న తిరుమల తిరుపతి దేవస్థానంలో కోటి హనుమాన్ చాలీసా పారాయణ కార్యక్రమం ఉంటుందని, ప్రతీ హిందువు పాల్గొనాలని కోరారు. ఈ కార్యక్రమంలో పొనకల్ సర్పంచ్ జక్కు భూమేశ్, ఆలయ కమిటీ చైర్మన్ మిక్కిలినేని రాజశేఖర్, హనుమాన్ చాలీసా పారాయణం భక్తులు కస్తూరి నాగేశ్వర్, గుండ సుధాకర్, అంజుత రావు, కైరం భీమాగౌడ్, దొంతుల సతీశ్, శ్రీనివాస్, కొత్త వేణుగోపాల్, రాము, సురేశ్, చంద్రశేఖర్, చందు పాల్గొన్నారు.

'అక్టోబర్‌లో సమ్మెకు సిద్ధంగా ఉండాలి'



సమావేశంలో జాతీయ సంఘాల నేతలు

నస్పూర్: కోలిండియాలోని బొగ్గు పరిశ్రమల్లో అధికారులకు యాజమాన్యం జీతాలు, సౌకర్యాలు అలవెన్స్‌లను కాలపరిమితి ముగియక ముందే పెంచినట్లయితే.. దానిని వ్యతిరేకిస్తూ జాతీయ సంఘాలు బీఎంఎస్, ఏఐటీయూసీ, హెచ్ఎంఎస్, సీఐటీయూ, ఐఎన్టీయూసీ అక్టోబర్ 5, 6, 7వ తేదీల్లో సమ్మెకు నిర్ణయించినట్లు బీఎంఎస్ బొగ్గు పరిశ్రమ ఇంచార్జి కొత్త బాపు లక్ష్మారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. గురువారం రాంచిలోని సీసీఎల్ దర్బంగ హౌజ్‌లో ఆయా జాతీయ సంఘాల ఆలిండియా ప్రతినిధులు అత్యవసర సమావేశం నిర్వహించారని పేర్కొన్నారు. బొగ్గు పరిశ్రమలో పని చేస్తున్న కార్మికుల 11వ వేతన ఒప్పందానికి వ్యతిరేకంగా కోల్ ఇండియా ఆఫీసర్స్ అసోసియేషన్ సభ్యులు తీసుకున్న చర్యలను తీవ్రంగా ఖండించారని పేర్కొన్నారు. కోల్ ఇండియా యాజమాన్యం పే రివ్యూను అధికారులకు అమలు చేస్తే కార్మికులకు సైతం అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమ్మె విజయవంతానికి అన్ని యూనియన్లు సంయుక్తంగా సన్నాహక సమావేశాలు ప్రారంభించాలని పిలుపునిచ్చారు. ఈ నెల 21, 22 తేదీల్లో మైన్ డిపార్ట్‌మెంట్లు, అక్టోబర్ 3న ఏరియా స్థాయిలో ఉమ్మడి ధర్నాలు, నిరసన ప్రదర్శనలు నిర్వహించాలని తెలిపారు.

దంచికొట్టిన వాన



ఎంచపాయిలో మునిగిన పత్తి పంట

- వేమనపల్లి, కన్నెపల్లి, కోటపల్లిలో భారీ వర్షం
- ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు, వంకలు
- గేట్లుఎత్తిన ప్రాజెక్టులు.. పరవళ్లు తొక్కుతున్న గోదావరి
- నీట మునిగిన పత్తి, వరి నారుమళ్లు

మంచిర్యాలఅగ్రికల్చర్: జిల్లా వ్యాప్తంగా రెండ్రోజులుగా వర్షం దంచి కొడుతోంది. బుధవారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు పడగా.. రాత్రి భారీ వర్షం కురిసింది. గురువారం ఉదయం ఉదయం నుంచి సాయంత్రం ముసురు పడుతూనే ఉంది. కొన్ని మండలాల్లో ఓ మోస్తరు నుంచి భారీ వర్షం పడింది. బుధవారం రాత్రి నుంచి గురువారం వరకు 46.5మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదైంది. వేమనపల్లి, కన్నెపల్లి, కోటపల్లి మండలాల్లో వర్షానికి వాగులు, వంకలు పొంగి ప్రవహిస్తున్నాయి. కుంటలు, చెరువుల్లోకి భారీగా వరద నీరు చేరుతోంది. ఒర్రెలు, వాగులపై నిర్మించిన చెక్‌డ్యాంల మీదుగా నీరు పొంగిపొర్లుతుండడంతో పలు గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. పలు చెరువులు నిండడంతో మత్తడి పారుతున్నాయి. సింగరేణి ప్రాంతాల్లోని శ్రీరాంపూర్, రామకృష్ణాపూర్, మందమర్రి, బెల్లంపల్లి, కైరిగూడ, డోర్లి ఏరియాల్లోని ఓపెన్‌కాస్టుల్లో వర్షంతో బొగ్గు ఉత్పత్తి నిలిచిపోయి రూ.కోట్లలో నష్టం వాటిల్లింది. వేమనపల్లి మండలంలో అత్యధికంగా 140.6మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. లోతట్టు ప్రాంతాల్లోని పొలాలు నీటముగిగాయి. కన్నెపల్లి మండలం ముత్తాపూర్, భీమిని మండలం చిన్నతిమ్మాపూర్ లోతట్టు ప్రాంతాల్లోని ఇళ్లలోకి నీరు చేరడంతో ఇబ్బందులు పడ్డారు. పట్టణ, గ్రామాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోయి అంధకారం నెలకొంది. మరో రెండ్రోజుల వర్షసూచనతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఎడతెరిపి లేని వర్షాలతో ఇప్పటికే పత్తి చేలల్లో వేరుకుళ్లు తెగులు సోకి ఎర్రబారుతున్నాయి.



కన్నెపల్లి మండలంలో వరద నీటిలో పత్తి పంట



నిండుగా ప్రవహిస్తున్న ప్రాణహిత నది

జిల్లాలో నమోదైన వర్షపాతం

జిల్లాలో ఇప్పటివరకు సాధారణ వర్షపాతం 854.5 మిల్లీమీటర్లు కాగా 920.3 మిల్లీమీటర్లు కురిసింది. 8 శాతం అధికంగా నమోదైంది. ఆరు మండలాల్లో 20 నుంచి 30 శాతం అధిక వర్షపాతం నమోదు కాగా 11 మండలాల్లో సాధారణ వర్షం కురిసింది. భీమిని మండలంలో 20 శాతం లోటు వర్షపాతం నెలకొంది.

గోదావరిలోకి భారీగా వరద నీరు

మహారాష్ట్రతోపాటు జిల్లాలో కురుస్తున్న వర్షాలకు ప్రాణహిత, గోదావరి నదులు పరవళ్లు తొక్కుతున్నాయి. కడెం, ఎల్లంపల్లి ప్రాజెక్టులకు ఎగువ ప్రాంతాల నుంచి భారీగా వరద నీరు వస్తుండడంతో గేట్లు ఎత్తి దిగువన గోదావరిలోకి వదులుతున్నారు. కడెం ప్రాజెక్టు నాలుగు గేట్లు ఎత్తడంతో 67వేల క్యూసెక్కుల వరద నీరు వస్తోంది.

- ఎల్లంపల్లి ప్రాజెక్టు పది గేట్లు ఎత్తి లక్ష క్యూసెక్కుల నీటిని గోదావరిలోకి వదులుతున్నారు.
- నీల్వాయి ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటమట్టం 124 మీటర్లకు చేరుకోగా.. ఎగువ ప్రాంతం నుంచి 870 క్యూసెక్కులు ఇన్‌ఫ్లో వస్తోంది. మత్తడి నుంచి 150 క్యూసెక్కుల నీరు దిగువకు వెళ్తోంది.
- ర్యాలీవాగు ప్రాజెక్టు నీటిమట్టం 151.50మీటర్ల సామర్థ్యం కాగా ప్రస్తుతం 147.60 మీటర్లకు చేరింది. 200 క్యూసెక్కుల నీరు ఇన్‌ఫ్లో వస్తోంది.
- గొల్లవాగు ప్రాజెక్టు నీటిమట్ట సామర్థ్యం 155.50మీటర్లు కాగా 152.400మీటర్లకు చేరింది. ఎగువ ప్రాంతం నుంచి 140.772 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతోంది.

నీటమునిగిన పంటలు

జిల్లాలో పత్తి, కంది, వరి పంటలు ఎదిగే దశలో ఉండగా ఇటీవల కలుపు నివారణతోపాటు ఎరువులు వేసుకుంటున్నారు. వరదలతో పత్తి మొక్కలపై ఇసుక మేటలు వేస్తున్నాయి. మరోవైపు ఇటీవల కురిసిన వర్షాలు, వరదలతో ప్యారవీల్టుతో వేరుకుల్లు సోకుతోంది. వరినారుమళ్లు చెరువులను తలపిస్తున్నాయి.

మండలాల్లో నమోదైన వర్షపాతం(మిల్లీమీటర్లలో)

వేమనపల్లి	140.6
కన్నెపల్లి	97.0
కోటపల్లి	85.0
భీమిని	64.7
చెన్నూర్	63.4
నెన్నెల	63.9
భీమారం	51.4
బెల్లంపల్లి	42.3
మందమర్రి	41.5
కాసిపేట	39.5
తాండూర్	39.1
జైపూర్	29.6
నస్పూర్	17.8
మంచిర్యాల	15.6
దండేపల్లి	15.4
హాజీపూర్	15.0
లక్సెట్టిపేట	09.7
జన్నారం	04.9

వేమనపల్లిలో కుండపోత

వేమనపల్లి: మండలంలో బుధవారం అర్ధరాత్రి నుంచి కుండపోత వర్షం కురిసింది. జిల్లాలోనే అత్యధికంగా 140.06 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. నీల్వాయి, మత్తడివాగులు, బుయ్యారం ఒర్రెలు వరద ఉధృతితో ఉప్పొంగి ప్రవహించాయి. ప్రాణహిత వరద నీటితో నిండుగా ప్రవహిస్తోంది. మండల కేంద్రానికి సమీపంలోని ఎంచపాయ పొద్దంతా వరద నీటితో నిండుగా ప్రవహించింది. సుమారు 150 ఎకరాల్లో పత్తి, 120 ఎకరాల్లో వరి, 12 ఎకరాల్లో మిర్చి పంట వరదపాలైంది. ఎకధాటిగా కురుస్తున్న వర్షంతో జనజీవనం అస్తవ్యస్తంగా మారింది. ఇళ్ల నుంచి ప్రజలు బయటకు రాలేదు.

పండుగలు ప్రశాంతంగా జరుపుకోవాలి

- జిల్లా కలెక్టర్ బి.సంతోష్
- శాంతికమిటీ సమావేశం



మాట్లాడుతున్న కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: ఈ నెల 18న వినాయక చవితి, 28న ఈద్ మిలాద్-ఉన్-నబి పండుగలు శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా నిర్వహించుకోవాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అనదపు కలెక్టర్లు రాహుల్, మోతీలాల్, డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్, మంచిర్యాల, బెల్లంపల్లి ఆర్డీవోలు రాములు, సురేష్‌లతో కలిసి జిల్లా స్థాయి అధికారులు, ఉత్సవ సమితి ప్రతినిధులతో వినాయక చవితి ఉత్సవాల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ వినాయక మండపాల ఏర్పాటుకు అనుమతి తీసుకోవాలని చెప్పారు. వినాయక నిమజ్జనం, శోభాయాత్ర కోసం అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. పోలీసు, రెవెన్యూ, మున్సిపల్ కమిషనర్లు అవసరమైన ఏర్పాట్లు చేయాలని సూచించారు. రాత్రి 10 గంటల తర్వాత స్పీకర్లు వినియోగించరాదని, డీజేలకు అనుమతి లేదని తెలిపారు. ఉత్సవాల్లో ఇబ్బందులు తలెత్తకుండా కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేస్తామని, సమాచారం, ఫిర్యాదుల కోసం కంట్రోల్ రూమ్ 08736 250500, 250501, 250504 నంబర్లలో సంప్రదించాలని తెలిపారు.

అసంక్రమణ వ్యాధులను గుర్తించాలి

మంచిర్యాలటౌన్: ఆయుష్మాన్ భవ కార్యక్రమంలో భాగంగా ఈ నెల 17నుంచి అసంక్రమణ వ్యాధులను ఇంటింటికీ వెళ్లి సర్వే చేసి గుర్తించి, వైద్య పరీక్షలను నిర్వహించాలని జిల్లా వైద్యాధికారి డాక్టర్ సుబ్బరాయుడు అన్నారు. జిల్లా కేంద్రంలో గురువారం వైద్య సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలకు అసంక్రమణ వ్యాధుల గుర్తింపు, సర్వేపై సమీక్ష సమావేశం నిర్వహించారు. బీపీ, షుగర్, క్యాన్సర్ స్క్రీనింగ్ చేయడం, ఎలా గుర్తించడం అనే అంశాలపై శిక్షణ అందించారు. పొగాకు ఆధారిత ఉత్పత్తుల వినియోగాన్ని నియంత్రించడంపై వివరించారు. ఈ కార్యక్రమంలో డీఎస్‌వో డాక్టర్ ఫయాజ్‌ఖాన్, డాక్టర్ శివ ప్రతాప్, సీహెచ్‌వో లింగారెడ్డి, డీడీఎం ప్రవళిక, డెమో బుక్క వెంకటేశ్వర్ పాల్గొన్నారు. అనంతరం మిమ్స్ డిగ్రీ కళాశాల విద్యార్థులకు ఆత్మహత్యల నివారణపై సైక్రియాటిస్టు డాక్టర్ సునిల్, సీహెచ్‌వో లింగారెడ్డి అవగాహన కల్పించారు.

పకడ్బందీగా ఓటరు జాబితా

- ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు చేసుకోవాలి
- జిల్లా కలెక్టర్ బదావత్ సంతోష్

మంచిర్యాలఅగ్రికల్చర్: తప్పులకు తావు లేకుండా పకడ్బందీగా ఓటరు జాబితా సిద్ధం చేయాలని, 18ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు జాబితాలో తమ పేరు నమోదు చేసుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం నస్పూర్‌లోని సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్, స్పెషల్ డెప్యూటీ కలెక్టర్ సిడాం దత్తు, మంచిర్యాల ఆర్డీవో రాములతో కలిసి గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో నూతన ఓటరు నమోదు, ఓటరు జాబితా సవరణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 28న అభ్యంతరాలు, ఫిర్యాదులు పరిశీలించి, అక్టోబర్ 4న తుది జాబితా ప్రచురిస్తామని, ఆ దిశగా అధికారులు చర్యలు తీసుకోవాని సూచించారు.



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ సంతోష్

మత్తు పదర్థాల విక్రయంపై కఠిన చర్యలు

మంచిర్యాలఅగ్రికల్చర్: మత్తు పదర్థాల వినియోగం, విక్రయాలపై కఠిన చర్యలు తీసుకోవాలని, మత్తు పదార్థాలు, మద్య పానీయాల వినియోగం యువత భవిష్యత్‌కు నిరోధకమని కలెక్టర్ బి.సంతోష్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో డీసీపీ సుధీర్ రామ్‌నాథ్ కేకన్‌తో కలిసి జిల్లా పోలీసు, విద్య వైద్య, అటవీ, వ్యవసాయ, సాంఘిక, ఆదాయ పన్ను, రెవెన్యూ శాఖల అధికారులు, జిల్లా డ్రగ్ ఇన్‌స్పెక్టర్లు, ఎస్‌సీబీ, ప్రతినిధులతో మత్తు పదార్థాల నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో నిషేధిత మత్తు పదార్థాల రవాణా, విక్రయాలపై నిఘా ఏర్పాటు చేయాలన్నారు. గంజాయి సాగు కాకుండా అధికారులు పర్యవేక్షించాలని సూచించారు. మంచిర్యాల ఏసీపీ తిరుపతిరెడ్డి, సీఐ రాజు, డ్రగ్ ఇన్‌స్పెక్టర్ చందన పాల్గొన్నారు.

విధులు సక్రమంగా నిర్వర్తించాలి

మంచిర్యాలఅగ్రికల్చర్: వీఆర్‌ఓ, వీఆర్‌ఏల క్రమబద్ధీకరణలో భాగంగా మున్సిపాలిటీలకు కేటాయించిన వార్డు అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ సంతోష్ అన్నారు. గురువారం సమీకృత కలెక్టరేట్‌లో జిల్లా అదనపు కలెక్టర్ రాహుల్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్లు, వార్డు అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ మున్సిపల్ కమిషనర్లు సూచనలు, సలహాలు ఇస్తూ విధులు సక్రమంగా నిర్వర్తించేలా పర్యవేక్షించాలని తెలిపారు.

కిష్టంపేటకు స్వచ్ఛ సర్వేక్షణ్ అవార్డు

చెన్నూర్‌రూరల్: మండలంలోని కిష్టంపేట గ్రామ పంచాయతీకి స్వచ్ఛ సర్వేక్షణ్‌లో భాగంగా రాష్ట్ర స్థాయి అవార్డు లభించింది. గురువారం హైదరాబాద్‌లోని రాజేంద్రనగర్ టీఎస్ఐపీఏఆర్‌డీలో పంచాయతీరాజ్ శాఖ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సల్తానియా, కమిషనర్ హనుమంతరావులు కిష్టంపేట సర్పంచ్ బుర్ర రాకేష్‌గౌడ్, పంచాయతీ కార్యదర్శి దివాకర్‌లను సన్మానించి అవార్డు అందజేశారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ అవార్డ్-2023 గాను స్వచ్ఛ భారత్ మిషన్‌లో భాగంగా కిష్టంపేట గ్రామ పంచాయతీలో ఇంప్లిమెంటేషన్ ఆఫ్ ఓడీఎఫ్ సస్టైనబిలిటీ మెసర్స్, ఓడీఎఫ్ కంపోనెంట్స్ గుర్తింపు వీటిల్లో ప్రతిభ కనబరిచినందుకు అవార్డు అందుకున్నారు.



మంత్రి దయాకర్ చేతుల మీదుగా అవార్డు అందుకుంటున్న సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి

రెండో విడత గొర్రెల పంపిణీ

జైపూర్: మండలంలోని షెట్‌పల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో రెండో విడత గొర్రెలు పంపిణీ చేశారు. కడప జిల్లా నుంచి తీసుకువచ్చిన ఆరు యూనిట్ల గొర్రెలు షెట్‌పల్లి, నర్సింగాపూర్ గ్రామాల్లో లబ్ధిదారులకు అందజేశామని గొర్రెలు, మేకల సహకార యూనియన్ జిల్లా చైర్మన్ కొమ్ము అశోక్‌యాదవ్ తెలిపారు. గొల్లకుర్మలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని అన్నారు. డీడీలు కట్టిన ప్రతీ ఒక్కరికి త్వరలోనే గొర్రెలు వస్తాయని తెలిపారు. మండల పశువైద్యాధికారి సతీశ్, పీఏసీఎస్ చైర్మన్ గుండ తిరుపతి, సొసైటీ అధ్యక్షుడు ఐలయ్య, నాయకులు మల్లేశ్, పర్వతాలు, గట్టయ్య, పోచం పాల్గొన్నారు.

టెట్‌కు సర్వం సిద్ధం

- నేడు ఉపాధ్యాయ అర్హత పరీక్ష
- పేపర్-1 అభ్యర్థులు 8,737
- పేపర్-2 అభ్యర్థులు 5,745

మంచిర్యాలఅర్బన్: ఉపాధ్యాయ అర్హత పరీక్ష(టెట్)కు జిల్లా విద్యాశాఖ ఏర్పాట్లు పూర్తి చేసింది. త్వరలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో శుక్రవారం ఈ పరీక్ష నిర్వహిస్తోంది. గత ఏడాది టెట్ నిర్వహించిన విద్యాశాఖ టీఆర్టీ నోటిఫికేషన్ ఇస్తుందని అంతా భావించినా ప్రకటన వెలువడలేదు. 2017 జూలైలో చివరిసారిగా నిర్వహించగా ఉపాధ్యాయ నియామకాలు చేపట్టలేదు. 2022 జూన్ 12న టెట్ నిర్వహించగా.. పోస్టుల భర్తీకి నోటిఫికేషన్లు వస్తున్నాయన్న ఆశతో ఎక్కువ మంది పరీక్ష రాశారు. ఏడాది గడిచినా నియామకాలు చేపట్టకపోవడంతో టెట్ అర్హులు ఉద్యోగాల భర్తీ కోసం ఎదురు చూస్తున్నారు. ఈ నేపథ్యంలో త్వరలో డీఎస్సీ నోటిఫికేషన్ జారీ చేస్తామని మంత్రి సబితాఇంద్రారెడ్డి ప్రకటించారు. దీంతో మరోసారి టెట్ నిర్వహణకు అధికారులు సర్వం సిద్ధం చేశారు.

పరీక్షలు ఇలా..

ఉపాధ్యాయ అర్హత పరీక్ష నిర్వహణకు అధికారులు ఏర్పాట్లు పూర్తి చేశారు. శుక్రవారం నిఘా నీడలో టెట్ నిర్వహించనున్నారు. జిల్లాలో 113 ఉపాధ్యాయ ఖాళీలు ప్రకటించిన నేపథ్యంలో ఈ పరీక్షకు ప్రాధాన్యం ఏర్పడింది. పరీక్షా కేంద్రాల్లో, సీఎస్ గదుల్లో నిఘా కెమెరాల మధ్య ప్రశ్నపత్రాల పంపిణీ, సీల్ వేయనున్నారు. హాల్‌టికెట్‌పై ఫొటో, సంతకం లేకపోతే పాస్‌పోర్టు సైజ్ ఫొటో అతికించి గెజిటెడ్ అధికారితో సంతకం, ఆధార్‌కార్డు జతపరిచి డీఈవోను కలిస్తే ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి అవసరమైన నిర్ణయం తీసుకోనున్నారు. ఉదయం 9.30గంటల నుంచి 12గంటలకు పేపర్-1 పరీక్షకు 8,737 మంది హాజరు కానుండగా 33 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5గంటల వరకు జరిగే పరీక్ష పేపర్-2కు 5,745 మంది అభ్యర్థులు హాజరు కానున్నారు. జిల్లాలోని ఆయా డిపార్ట్‌మెంట్లకు చెందిన ఉద్యోగులకు పరీక్ష విధులు కేటాయించారు. 12 మంది రూట్ ఆఫీసర్లు, 33 మంది చీఫ్ సూపరింటెండెంట్లు, 33 మంది డిపార్ట్‌మెంట్ ఆఫీసర్లు, 99 మంది హాల్ సూపరింటెండెంట్లు, 330 మంది ఇన్విజిలేటర్లను నియమించారు. గురువారం విధులు కేటాయించిన ఉద్యోగులు రిపోర్టు చేయగా.. విధులకు అవసరమైన స్టేషనరీని అప్పగించారు.



బాలుర ఉన్నత పాఠశాల పరీక్ష కేంద్రం

సమయం దాటితే అనుమతి లేదు

టెట్ రాసే అభ్యర్థులను ఉదయం 9.30 గంటలు దాటితే పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి సెల్‌ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు తీసుకుని రాకూడదు. అభ్యర్థులు ముందే పరీక్ష కేంద్రానికి చేరుకుంటే మంచిది.

– యాదయ్య, డీఈవో

కుక్కలు భౌబోయ్..!

- వీధుల్లోకి వచ్చినవారిపై స్వైరవిహారం
- ఆస్పత్రుల పాలవుతున్న బాధితులు
- శునకాల నియంత్రణ చర్యలు శూన్యం
- ఎనిమల్ కేర్ సెంటర్ తెరిచేదెప్పుడో?

మంచిర్యాలటౌన్: జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో కుక్కల బెడద ఎక్కువగా ఉంది. రోడ్లపై గుంపులుగా తిరుగుతూ చిన్నారులతోపాటు పెద్దవారిపైనా దాడికి దిగుతున్నాయి. వీధి కుక్కలను నియంత్రించక పోవడంతో వాటి బారిన పడేవారి సంఖ్య పెరుగుతోంది. వీటిపై ఎలాంటి చర్యలు తీసుకున్నా.. జంతు ప్రేమికులు ఏమి చేస్తారోననే భయం, చట్ట ప్రకారం చర్యలు ఉంటాయనే ఉద్దేశంతో ఎలాంటి చర్యలు చేపట్టడం లేదు. దీంతో రోజురోజుకూ పెరుగుతున్న శునకాల కారణంగా వీధుల్లోకి వచ్చేందుకు ప్రజలు జంకుతున్నారు.

ఏటేటా పెరుగుతున్న బాధితులు

జిల్లావ్యాప్తంగా 2021లో 2,168 మంది, 2022లో 1,685 మంది, 2023 సెప్టెంబర్ 11వరకు 2,151 మంది కుక్కకాటుకు గురయ్యారు. ఇవి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ లెక్కల్లోకి ఎక్కినవి మాత్రమే. ఇవి కాకుండా, ప్రైవేట్ ఆస్పత్రులకు వెళ్లిన వారి సంఖ్య ఎక్కువగానే ఉంటుంది. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లో ఏ వీధిలో ఎన్ని కుక్కలున్నాయనే కనీస సమాచారం కూడా అధికారుల వద్ద లేదు. వీధుల వారీగా శునకాల సంఖ్యను లెక్కించి ఎప్పటికప్పుడు వాటికి రేబీస్ టీకాలు వేయించాల్సి ఉంది. కుక్కలను నియంత్రించక, వాటి సంఖ్యను లెక్కించక, రేబీస్ టీకాలు వేయకపోవడంతోనే జిల్లాలో వాటితోపాటు బాధితుల సంఖ్య పెరుగుతోంది.



మంచిర్యాలలో రోడ్లపై తిరుగుతున్న వీధి కుక్కలు

సంతతిని నియంత్రించాలని..

శునకాల నియంత్రణకు ప్రభుత్వం ఉపక్రమించింది. ఇందులో భాగంగానే జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లోని శునకాల సంతతిని నియంత్రించేందుకు సిద్ధపడింది. మంచిర్యాల మున్సిపాలిటీ పరిధి ఆండాళమ్మ కాలనీలోని డంప్‌యార్డు సమీపంలో రూ.35 లక్షలతో ఎనిమల్ కేర్ సెంటర్ ఏర్పాటుకు భవనం నిర్మించింది. శునకాల సంతతిని నియంత్రించే వాటికి కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేయాలని భావించింది. ఎనిమల్ కేర్‌సెంటర్‌లో వాటికి ఆపరేషన్ నిర్వహించి కోలుకునేవరకు ఇక్కడే ఉంచేందుకు ప్రత్యేకంగా జాలీలతో కూడిన షెడ్ నిర్మించింది. ఆపరేషన్ అనంతరం కోలుకున్నాక ఎక్కడి కుక్కలను అక్కడే వదిలేయాల్సి ఉంటుంది. దీంతో క్రమంగా వాటి సంతతి తగ్గే అవకాశముంటుంది. కానీ.. నిర్మాణం పూర్తయి నెలలు గడుస్తున్నా సెంటర్‌ను ప్రారంభించడం లేదు.

జిల్లాలో కుక్కకాటు బాధితుల వివరాలు

సంవత్సరం	బాధితుల సంఖ్య
2021	2,168
2022	1,685
2023	2,151(ఈ నెల 11వరకు)

త్వరలోనే అందుబాటులోకి తెస్తాం



మంచిర్యాల మున్సిపాలిటీ పరిధిలో నిర్మించిన ఎనిమల్ కేర్ సెంటర్‌ను ఈ నెలలోనే ప్రారంభించేలా తగిన చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే ఇందుకు అవసరమైన పశువైద్యాధికారిని నియమించాలని ఉన్నతాధికారులకు సూచించాం. జిల్లాలోని ఏడు మున్సిపాలిటీల్లోని శునకాలను ఇక్కడికే తీసుకురావాల్సి ఉంటుంది. అందుకోసం ప్రత్యేకంగా వాహనం ఏర్పాటు చేయడంతోపాటు సెంటర్‌లో వసతుల కల్పన త్వరలోనే పూర్తిచేస్తాం.

– మారుతీప్రసాద్, మున్సిపల్ కమిషనర్, మంచిర్యాల

క్లుప్తంగా

గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం

రామకృష్ణాపూర్: గద్దెరాగిడి హైవేపై ఈ నెల 6న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన గుర్తుతెలియని వ్యక్తి మంచిర్యాల ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి బుధవారం రాత్రి మృతిచెందినట్లు పట్టణ ఎస్సై రాజశేఖర్ తెలిపారు. మృతుడి వయస్సు సుమారు 60 నుంచి 70 ఏళ్ల ఉంటాయని, మృతదేహం ప్రస్తుతం మంచిర్యాల ఆసుపత్రి మార్చురీలో భద్రపర్చినట్లు తెలిపారు. మృతుడి ఆచూకీ తెలిసిన వారు 8712656572లో సంప్రదించాలని కోరారు.

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సమ్మెనోటీసు

మంచిర్యాలఅగ్రికల్చర్: ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ అనుబంధ యూనియన్ ఆధ్వర్యంలో ఆశావర్కర్లు గురువారం జిల్లా కలెక్టరేట్ ఏవో రాజేశ్వర్‌రావుకు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ మాట్లాడుతూ ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని రాష్ట్ర వ్యాప్తంగా ఆందోళన చేపడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. కనీస వేతనం రూ.18వేలు ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రూ.10లక్షల ప్రమాదబీమా కల్పించాలని, అదనపు పనులు కేటాయించరాదని తెలిపారు. సెప్టెంబర్ 24లోగా సమస్యలు పరిష్కరించకుంటే 25 నుంచి సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో కవిత, సమ్మక్క, పద్మ, మంగ, లక్ష్మి ఉన్నారు.

మంత్రి జగదీశ్వర్‌రెడ్డిపై విచారణ జరపాలి

నస్పూర్: రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్ రెడ్డి, ఆయన కుటుంబ సభ్యుల ఆస్తులపై సీబీఐ విచారణ జరిపించాలని భారత యాదవ సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సిద్ది రమేశ్ యాదవ్ తెలిపారు. గురువారం ఆయన నాయకులతో కలిసి నస్పూర్ శ్రీరాంపూర్ ప్రెస్‌క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఉమ్మడి నల్గొండ జిల్లా మాజీ డీసీఎంఎస్ చైర్మన్ వట్టె జానయ్య యాదవ్‌పై అకారణంగా నకిలీ కేసులు పెట్టి ఇబ్బందులకు గురి చేస్తున్నారని ఆరోపించారు. సూర్యాపేట నుంచి బీసీ కోటాలో టికెట్ కేటాయించాలని అధిష్టానాన్ని కోరినందుకే కక్ష గట్టారని పేర్కొన్నారు. జిల్లా అధ్యక్షుడు గొర్ర తిరుపతియాదవ్, జిల్లా మహిళా అధ్యక్షురాలు అరిగెల పద్మయాదవ్ పాల్గొన్నారు.

తుది మెరుగులు...


తీరొక్క రూపాల్లో గణనాథుల ప్రతిమలు


సిద్ధమైన గణపతి విగ్రహాలు

- ముస్తాబవుతున్న గణనాథులు
- 18న వినాయక చవితి
- స్థానిక కళాకారుల చేతుల్లో సిద్ధమైన విగ్రహాలు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): తీరొక్క రూపాల్లో వినాయక విగ్రహాలు సిద్ధమవుతున్నాయి. ఈ నెల 18వ తేదీ సోమవారం వినాయక చవితి పండగ సందర్భంగా పలుచోట్ల విక్రయదారులు గణనాథుల విగ్రహాలకు తుదిమెరుగులు దిద్దుతున్నారు. గతంలో రాజస్థాన్ కళాకారుల చేతుల్లో తయారయ్యే విగ్రహాలను పలు ప్రాంతాలకు వెళ్లి కొనుగోళ్లు చేసేవారు. ఇప్పుడు మంచిర్యాల, కోరుట్ల, జగిత్యాల కళాకారుల చేతుల్లో తయారవుతున్న వినాయక విగ్రహాలను కొనుగోలు చేసేందుకు ఆసక్తి చూపుతున్నారు. పండగకు సరిగా మూడు నెలల ముందు నుంచే వినాయక విగ్రహాల తయారీ ఊపందుకుంది. వివిధ రూపాల్లో తీర్చిదిద్దిన ఆదిదేవుడైన గణపతి విగ్రహాలను ఒక అడుగు నుంచి మొదలు 10 అడుగుల వరకు తయారు చేస్తున్నారు. ఈ విగ్రహాలను రూ.4వేల నుంచి రూ.30వేల వరకు విక్రయిస్తున్నారు. ఈ ప్రాంతంలో దాదాపు 500 వరకు విగ్రహాలు అమ్ముడవుతున్నాయని విక్రయదారులు చెబుతున్నారు. అయితే మట్టి విగ్రహాల తయారీపై పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతున్నా ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో తయారు చేసే విగ్రహాల అమ్మకాలు మాత్రం తగ్గడం లేదు.

30ఏళ్లకు పైగా విగ్రహాలు చేస్తున్నం..



మంచిర్యాలలో 30 ఏళ్లకు పైగా వినాయక, దుర్గాదేవి విగ్రహాలను ఇక్కడ తయారు చేస్తున్నాం. మొదట మట్టి విగ్రహాలను ఎక్కువగా తయారు చేసేవాళ్లం. ఇప్పుడు పోటీ పెరగడంతో పాటు అందమైన విగ్రహాలు, రంగురంగుల విగ్రహాలపై ఆసక్తి కనబరచడంతో ప్లాస్టర్ ఆఫ్ పారీస్‌తో విగ్రహాలను తయారు చేస్తున్నాం. విగ్రహాల తయారీ హానికారకం కాకుండా జాగ్రత్తలు తీసుకుంటున్నాం. మట్టి, సిమెంట్, కొబ్బరిపీచుతో వినాయక రూపాలు తయారు చేస్తాం.

– కె.సత్తిబాబు, విగ్రహాల తయారీదారుడు

మట్టి గణపతులే ముద్దు


మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్న రాతిపల్లి నగేశ్, అతడి కుటుంబ సభ్యులు

చెన్నూర్‌రూరల్: ఆరేళ్లుగా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేస్తూ పర్యావరణ పరిరక్షణకు పాటుపడుతున్నాడు. మండలంలోని కిష్టంపేట గ్రామానికి చెందిన రాతిపల్లి నగేష్ కుటుంబం. ఇంటి వద్ద మట్టితో చిన్న, చిన్న వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాడు. కోటపల్లి మండలం శంకరాపూర్ గ్రామానికి చెందిన నగేష్ వృత్తిరీత్యా కుమ్మరి. పర్యావరణాన్ని పరిరక్షించేందుకు ఇంటి వద్ద ఆరేళ్లుగా మట్టితో వినాయక విగ్రహాలు తయారు చేస్తున్నట్లు పేర్కొంటున్నాడు.

మహారాష్ట్ర నుండి మట్టిని తెచ్చి...

ఇక్కడ చెరువుల్లో మట్టితో విగ్రహాలు బరువుగా ఉండటం, సరైన ఆకృతులు రావడం లేదని, మహారాష్ట్ర నుంచి మట్టిని తీసుకు వచ్చి విగ్రహాలను తయారు చేస్తున్నట్లు నగేష్ చెబుతున్నాడు. ఈ ఏడాది ఎనిమిది ఇంచుల నుంచి 15 ఇంచుల విగ్రహాలను ఇప్పటి వరకు సుమారు 200 వరకు మట్టి వినాయక విగ్రహాలను తయారు చేశాడు.

ఆరేళ్లుగా మట్టితో తయారు చేస్తున్నాను.



ఆరేళ్ల నుంచి మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాను. కుటుంబ సభ్యులు నాకు సహాయంగా ఉంటారు. పర్యావరణ పరిరక్షణలో భాగంగానే ఏటా మట్టితో వినాయక విగ్రహాలను తయారు చేస్తున్నాను. ఒక్కో విగ్రహానికి రూ.150 నుండి రూ.200ల వరకు ఉంటుంది.

–రాతిపల్లి నగేశ్, మట్టి విగ్రహాల తయారీదారుడు

నందులపల్లి మల్లన్న గుడి పూజారి మృతి


శవంతో నిరీక్షిస్తున్న చిన్న పోశం కుటుంబ సభ్యులు


సంఘటన స్థలంలో పోలీసుల బందోబస్తు

- గుడి వద్ద ఖననం చేయడాన్ని అడ్డుకున్న బంధువులు
- శవంతో 24 గంటల నిరీక్షణ
- పోలీసుల జోక్యంతో అంతిమ సంస్కారాలు పూర్తి

నెన్నెల: భూ సమస్యతో నందులపల్లి మల్లన్న గుడి పూజారి పాలగాని చిన్నపోశం అంతిమ సంస్కారాలు వివాదాస్పదంగా మారాయి. గుడి పక్కన సమాధి చేయడాన్ని బంధువులు అడ్డుకోవడంతో 24గంటలు శవంతో నిరీక్షించాల్సి వచ్చింది. పోలీసులు జోక్యంతో గొడవ సద్దుమణిగింది. స్థానికుల వివరాల ప్రకారం... నందులపల్లిలోని రావులమల్లన్న గుడికి పాలి అన్నదమ్ముళ్లైన పెద్ద పోశం, చిన్న పోశంలు పూజారులుగా కొనసాగుతున్నారు. గుడితో పాటు చుట్టుపక్కల వ్యవసాయ భూమిపై ఆ రెండు కుటుంబాల మధ్య కొన్ని సంవత్సరాలుగా వివాదం కొనసాగుతోంది. ఐదేళ్ల కిందట పెద్ద పోశం చనిపోగా గుడి పక్కన ఖననం చేసి స్మారక స్థూపంగా చిన్న గుడిని నిర్మించారు. చిన్న పోశం బుధవారం మృతి చెందగా గుడివద్దనే ఖననం చేయాలని వారి కుటుంబీకులు ఏర్పాటు చేస్తుండగా పెద్ద పోశం కుటుంబ సభ్యులు అడ్డుకున్నారు. భూమి పట్టా తమ పేరిట ఉందని సమాధి చేయబోనివ్వమని భీష్మించుకూర్చున్నారు. ఇరువర్గాలు వాదనకు దిగాయి. గొడవ భౌతికదాడులకు దిగే స్థాయికి చేరింది. విషయం పోలీసులకు తెలిసింది. బెల్లంపల్లి ఏసీపీ సదయ్య గురువారం నెన్నెలకు చేరుకొని ఇరువర్గాలతో మాట్లాడారు. గొడవలు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేసి అంతిమ సంస్కారాలు జరిపించారు. గుడి వద్ద తండ్రి భీరయ్య సమాధి పక్కనే చిన్న పోశం మృతదేహాన్ని సమాధి చేశారు. బెల్లంపల్లి, తాండూర్, మందమర్రి సీఐలు శంకరయ్య, శ్రీనివాస్‌రావు, మహేందర్‌రెడ్డిలతో పాటు ఎస్సైలు శ్యాంపటేల్, ప్రవీణ్, రాజశేఖర్, అశోక్, చందన్‌కుమార్, మహేందర్, రాజశేఖర్‌లు బందోబస్తు నిర్వహించారు.

సకాలంలో పంట రుణాలు మంజూరు చేయాలి

- ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్


మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో చాహత్ బాజ్‌పాయ్

ఉట్నూర్‌రూరల్: నూతనంగా పోడుపట్టాలు పొందిన రైతులకు పంట రుణాలు సకాలంలో మంజూరు చేయాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి చాహత్ బాజ్‌పాయ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం సాయంత్రం ఉట్నూర్ ఐటీడీఏ కార్యాలయంలోని తన చాంబర్‌లో ఆర్థిక సహాయ పథకం, పంట రుణాలు మంజూరుపై గిరిజన సంక్షేమ, ఉమ్మడి జిల్లా బ్యాంకు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పీవో మాట్లాడుతూ అర్హులైన గిరిజన లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకాలకు యూనిట్లను మంజూరు చేయడం జరిగిందని, నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాలు, బ్యాంకుల వారీగా లక్ష్యాలను చర్చించారు. సమావేశంలో లీడ్ బ్యాంక్ మేనేజర్ ప్రసాద్, ఏఓ రాంబాబు, డీపీవో ప్రవీణ్ పాల్గొన్నారు.

‘టీబీజీకేఎస్‌వి అసత్య ప్రచారాలు’


మాట్లాడుతున్న సీతారామయ్య

మందమర్రిరూరల్: సింగరేణిలో వేజ్‌బోర్డ్ బకాయిల చెల్లింపు ప్రకటన టీబీజీకేఎస్ నాయకులు ఫలితంగా యాజమాన్యం వెల్లడించిందని అసత్య ప్రచారం చేస్తోందని ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య అన్నారు. గురువారం ఏరియాలోని కేకే–5 గని ఆవరణలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కోలిండియాలో ఈ నెల 3న వేజ్‌బోర్డ్ బకాయిలు ఒకే దఫా చెల్లించాలని, సింగరేణిలో రెండు దఫాలు చెల్లిస్తామని యాజమాన్యం పేర్కొందని తెలిపారు. ఒకే దఫాలో చెల్లించాలని జీఎం కార్యాలయం ఎదుట ఏఐటీయూసీ ఆధ్వర్యంలో దీక్ష చేపట్టగా యాజమాన్యం దిగి వచ్చి ఈ నెల 21న ఒకే దఫా చెల్లిస్తామని ఆదేశాలు జారీ చేసిందని తెలిపారు. మోసపూరిత మాటలతో కార్మికులను టీబీజీకేఎస్ నమ్మించలేదన్నారు. ఆ యూనియన్ బ్రాంచ్ కార్యదర్శి సత్యనారాయణ ఆధ్వర్యంలో జరిగిన సమావేశంలో నాయకులు అక్బర్ అలీ, శ్రీనివాస్, బానయ్య, సమ్మయ్య, తిరుపతి పాల్గొనాలి.

విద్యార్థులు క్రీడల్లో రాణించాలి


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్మన్ కాంతయ్య

లక్సెట్టిపేట: విద్యార్థులు క్రీడాపోటీల్లో పాల్గొనాలని మున్సిపల్ చైర్మన్ నల్మాసు కాంతయ్య అన్నారు. మండల కేంద్రంలోని మహాత్మా జ్యోతిబాపూలే గురుకుల పాఠశాలలో గురువారం ఏర్పాటు చేసిన జిల్లాస్థాయి జూనియర్ అథ్లెటిక్స్ చాంపియన్‌షిప్ ఎంపిక పోటీల ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటు క్రీడా పోటీల్లో పాల్గొనడంతో ఉన్నత చదువుల కోసం ధ్రువీకరణ పత్రాలు ఉపయోగపడతాయన్నారు. క్రీడలతో శారీరక మానసికోల్లాసం లభిస్తుందని తెలిపారు. రెండు రోజుల పాటు కొనసాగే క్రీడా పోటీల్లో ప్రతిభ కనబర్చిన క్రీడాకారులను అక్టోబర్ 30వ తేదీన కరీంనగర్‌లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారని వివరించారు. అనంతరం క్రీడాపోటీలను ప్రారంభించారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మెన్ పాడేటి శ్రీనివాస్‌గౌడ్, కళాశాల ప్రిన్సిపాల్ గౌతంరెడ్డి పాల్గొన్నారు.

రేపు జిల్లా, జోనల్ స్థాయి రెజ్లింగ్ సెలక్షన్స్

నిర్మల్‌రూరల్: ఎస్‌జీఎఫ్ జిల్లా, జోనల్ స్థాయి (ఉమ్మడి ఆదిలాబాద్) అండర్ 14, 17 సెలక్షన్లు శనివారం భైంసా కేంద్రంలో నిర్వహిస్తున్నట్లు డీఈవో రవీందర్ రెడ్డి ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. భైంసాలోని వేదం తపోవన్ స్కూల్‌లో ఎంపిక పోటీలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. మిగతా వివరాల కోసం నిర్వహణ కార్యదర్శి, వ్యాయామ ఉపాధ్యాయుడు నఫీఖాన్‌ను సెల్ నం.9440957385లో సంప్రదించాలని సూచించారు.

ప్రభుత్వ ఉద్యోగాల్లో బీసీలకు 56శాతం రిజర్వేషన్ కల్పించాలి


మాట్లాడుతున్న వంగల దయానంద్

పాతమంచిర్యాల: రాష్ట్ర ప్రభుత్వం బీసీలకు ప్రభుత్వ ఉద్యోగ నియామకాల్లో బీసీలకు 56శాతం రిజర్వేషన్ కల్పించాలని బీసీ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర నాయకులు వంగల దయానంద్ అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో బీసీల జనాభా 56శాతం ఉంటే బీసీ ఉద్యోగులు కేవలం 9శాతం మాత్రమే ఉన్నారన్నారు. బీపీ మండల్ కమిషన్ బీసీలకు 27శాతం రిజర్వేషన్‌తో ఉద్యోగాలు కల్పించాలని నివేదిక ఇచ్చి 40ఏళ్ల గడిచినా ఏ ప్రభుత్వాలు కూడా చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. పాలక ప్రభుత్వం బీసీలకు 56శాతం ఉద్యోగాల్లో రిజర్వేషన్లు అమలు చేయకుంటే తగిన గుణపాఠం చెబుతామని హెచ్చరించారు. కార్యక్రమంలో బీసీ సంఘాల ఐక్య వేదిక జిల్లా అధ్యక్షులు గుమ్ముల శ్రీనివాస్, నాయకులు బోడంకి మహేష్, రాజన్న రాజమల్లు, దేవిసింగ్, చౌహాన్ పాల్గొన్నారు.

ఇక ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లు

- పెరుగుతున్న విద్యుత్ వాహనాల వినియోగం
- జిల్లాలో ఎంపిక చేసిన 26ప్రాంతాల్లో ఏర్పాటు
- స్టేషన్‌ల ఏర్పాటుకు ముగిసిన దరఖాస్తుల గడువు
- పర్యావరణ పరిరక్షణలో కీలకం కానున్న స్టేషన్లు


మంచిర్యాల రైల్వేస్టేషన్‌లో ఏర్పాటు చేసిన ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్ పాయింట్ (నమూనా కోసం)

మంచిర్యాలరూరల్(హాజీపూర్): జిల్లాలో రోజురోజుకూ విద్యుత్ వాహనాల వినియోగం పెరిగిపోతోంది. దీంతో విద్యుత్ వాహనాలకు అనుగుణంగా జిల్లాలో ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేసేలా ప్రభుత్వం సంకల్పించింది. అయితే ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్య(పీపీపీ) పద్ధతిలో పబ్లిక్ చార్జింగ్ స్టేషన్‌ల ఏర్పాటుకు ప్రభుత్వం పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ టీఎస్ రెడ్కో దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. పర్యావరణ కాలుష్య నివారణతో పాటు చమురు వినియోగాన్ని కూడా తగ్గించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎలక్ట్రిక్ వాహనాలను ప్రోత్సహించేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. ఈ క్రమంలోనే పెరిగిన వాహన, ఇంధన ధరలతో ప్రజలు ఎలక్ట్రిక్ వాహనాల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. దీనికి తోడు కంపనీలు రాయితీలు ఇస్తుండటం, నెట్‌వర్క్ మార్కెటింగ్ సదుపాయాలు కల్పించడంతో ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం పెరిగిపోతోంది. ఇందులో భాగంగా జిల్లాలో 26 చార్జింగ్ స్టేషన్‌లు ఏర్పాటు చేయనున్నారు. 200 నుంచి 300 చదరపు గజాల స్థలంలో చార్జింగ్ స్టేషన్ ఏర్పాటు చేసేలా రూపొందించారు. జిల్లా వ్యాప్తంగా జాతీయ రహదారులకు ఆనుకుని, పట్టణ, అర్బన్, రూరల్ ప్రాంతాల్లో మొత్తం 26 అనువైన స్థలాలను గుర్తించారు. జిల్లాలోని మంచిర్యాల ఐబీ, జన్నారం, తపాల్‌పూర్, దండేపల్లి, హాజీపూర్, జైపూర్, ఇందారం, దేవులవాడ, లక్సెట్టిపేట, అందుగులపేట, తాండూర్, నీల్వాయి, కోటపల్లి, మంచిర్యాలరూరల్, నెన్నెల్, కొమ్మెర, చెన్నూర్, మంచిర్యాల టౌన్–1, మంచిర్యాల టౌన్–3, బెల్లంపల్లి, బెల్లంపల్లి టౌన్, బెల్లంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాల, చెన్నూర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల ప్రభుత్వ డిగ్రీ కళాశాల, లక్సెట్టిపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాల, బెల్లంపల్లి ప్రభుత్వ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంతాల్లో చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేయనున్నారు. దరఖాస్తు ప్రక్రియ ఇటీవల ముగియగా నిబంధనల మేరకు వచ్చిన దరఖాస్తులను పరిశీలించి చార్జింగ్ స్టేషన్‌లను కేటాయించే అవకాశం ఉంది.

చార్జింగ్‌కు అనుకూలంగా..



విద్యుత్ వాహన వాడకం పెరగడంతో ఏర్పాటు చేయనున్న చార్జింగ్ స్టేషన్‌తో ఎంతో అనుకూలంగా ఉంటుంది. ఇంటి వద్ద చార్జింగ్ చేసుకుని ప్రయాణిస్తున్నప్పటికీ చార్జింగ్ సరిపోక ఒక్కోసారి వాహనం ఆగిపోతుంది. చార్జింగ్ స్టేషన్ ఏర్పాటుతో సౌకర్యంగా ఉండటమే కాదు చార్జింగ్ సమస్య ఉండదు. చార్జింగ్ స్టేషన్‌ల సంఖ్య పెంచితే మరింత ఎక్కువ దూరం ప్రయాణించే అవకాశం ఉంటుంది.

– బొద్దుకూరి కిరణ్‌కుమార్, మంచిర్యాల

భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటు..



తెలంగాణ పునరుత్పాదక ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ రాష్ట్ర వ్యాప్తంగా ఎలక్ట్రిక్ వాహనాల చార్జింగ్ స్టేషన్‌లను ప్రభుత్వ, ప్రైవేట్, పబ్లిక్ భాగస్వామ్య పద్ధతిలో ఏర్పాటు చేస్తోంది. టీఎస్ రెడ్కో ఎంపిక చేసిన ఆపరేటర్లకు పదేళ్ల వరకు రెవెన్యూ, షేరింగ్ ఆధారితంగా స్థలం కేటాయిస్తారు. చార్జింగ్ స్టేషన్‌ల నిర్వహణ నిబంధనల మేరకు సొంత ఖర్చులతో చార్జింగ్ స్టేషన్‌లను ఏర్పాటు చేసుకోవాల్సి ఉంటుంది. దరఖాస్తుల స్వీకరణ ప్రక్రియ ముగిసింది. త్వరలోనే పరిశీలించి మంజూరు చేసేలా చర్యలు ఉంటాయి.

– నివర్తి, రెడ్కో సంస్థ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మేనేజర్

‘రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమే’


మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి భాస్కర్

చెన్నూర్: రాష్ట్రంలో రానున్న ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడం ఖాయమని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుర్గం భాస్కర్ అన్నారు. స్థానిక హబీబ్ ఫంక్షన్ హాల్‌లో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నిధులు నియామకాల పేరుతో అధికారంలోకి వచ్చిన బీఆర్ఎస్ ప్రజలను మోసం చేసిందన్నారు. తెలంగాణ ప్రజల ఆకాంక్షను అర్థం చేసుకొని కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ఇచ్చిందన్నారు. ప్రజల ఆకాంక్ష నేరవేరాలంటే రాష్ట్రంలో కాంగ్రెస్ జెండా ఎగరాలన్నారు. అనంతరం ఈ నెల 17న తుక్కుగూడలో జరిగే కాంగ్రెస్ విజయభేరి బహిరంగ సభను విజయంతం చేయాలని కోరారు. దానికి సంబంధించిన వాల్ పోస్టర్లు ఆవిష్కరించారు. బహిరంగ సభకు పెద్దఎత్తున కార్మికులు, కర్షకులు, విద్యార్థులు, కార్యకర్తలు తరలిరావాలని పిలుపునిచ్చారు. సమావేశంలో చెన్నూర్, కోటపల్లి మండలాల నాయకులు చెన్నూరి రాజేశ్, ఆలూరి సంపత్, దుర్గం వెంకటస్వామి, పాతర్ల నాగరాజు, మహేశ్, రాకేశ్, శ్యామ్, రవి, చిప్పకుర్తి శ్రీనివాస్, యువరాజ్, అన్వర్, ముత్తు, చల్లా రాజిరెడ్డి పాల్గొన్నారు.